

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



### (ప్రారంభం)

**నవలా రచనా పరిచయం**

మొక్కపాటి నరసింహశాస్త్రి విరచిత 'బారిష్టర్ పార్వతీశం' అసంఖ్యాక తెలుగు పాఠకులను అలరించి, తెలుగు హాస్యానికి కొత్త ఒరవడి పెట్టిన విశిష్ట నవల. బయటి ప్రపంచం తెలియకుండా పెరిగిన ఓ పల్లెటూరి అమాయకుడు పార్వతీశం - లండన్లో బారిష్టర్ కోర్సు చెయ్యాలని బయల్దేరి - మొదటిసారిగా రైలెక్కి, తర్వాత ఓడెక్కి, నెమ్మదిగా లండన్ చేరుకుని మొత్తమ్మీద అనుకున్నది సాధించడం ఇతివృత్తం. లండన్ చేరుకోవడం మొదటి భాగం. లండన్‌లో చదువు రెండో భాగం. చదువై దేశానికి తిరిగొచ్చేక మూడో భాగం. ఈ 'ఫారిన్ వెళ్ళాలండి' నవల ప్రవాసాంధ్రుడిగా ప్రపంచాన్ని చూసిన ఓ విద్యాధిక వివాహితుడు రాజారావు ప్రభుత్వపు పనుపున ఇష్టాయిష్టాల మధ్య నలుగుతూ, <u>1973 సంవత్సరంలో,</u> జర్మనీ ప్రయాణానికి ఉద్యుక్తుడు కావడం ఇతివృత్తం. జర్మనీలో అతడి అనుభవాలు 'ఫారిన్ వెళ్ళానండి' గా రెండోభాగం. పార్వతీశం, రాజారావులవి పూర్తిగా భిన్న వ్యక్తిత్వాలైనా ప్రపంచ జ్ఞానంలో, స్పందనలో ఇద్దరూ ఒక్కటేనన్పింపించేటంత పోలిక ఉండడం విద్యాధికుల మనుకునేవారందరికీ గమనార్హం. ఎందుకంటే 'బారిష్టర్ పార్వతీశం' మొక్కపాటివారి సృజన కావచ్చు. కానీ ఈ నవలలో పాత్రలు (పేర్లు మార్చి ఉండొచ్చు), సన్నివేశాలు అన్నీ వాస్తవాలు. మొక్కపాటి వారి భవిష్యద్దర్శనానికి అభివందనాలు.

ఇక ఈ నవలా రచన మూడు గొప్ప తెలుగు పద్యాలతో ముడిపడి ఉంది. మొదటిది-

'చిప్పలోన పడిన చినుకు ముత్యంబయ్యె
నీటబడిన చినుకు నీట కలిసె
ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా
విశ్వదాభిరామ వినురవేమ'.

స్వానుభవాలకి అక్షరరూపం ఇవ్వడానికి ఈ పద్యం ఎందరో రచయితలకిలాగే మాకూ ప్రేరణ. ఈ నవలకూనూ.

రెండవది

'ఎవ్వడవీవు కాళ్లు మొగమ్మెరన ?' 'హంసమ' 'నెందునుందువో?'
'దవ్వుల మానసంబునను 'దాన విశేషములేమి చెప్పుమా?'
'మవ్వపు కాంచనాబ్జములు , మౌక్తికముల్ కలవందు' 'నత్తలో?'

'అవ్వి యెరుంగ'నన్న 'నహహా' యని నవ్వె బకంబులన్నియున్

మానససరోవరం నుండి ఎగిరి వచ్చి ఒక నీటిగుంటలో దిగిన రాజహంసతో అక్కడి కొంగల సంభాషణ ఈ ప్రాచీనపద్యం. మానస సరోవరంలోని విశేషాలేమంటే - అందమైన బంగారు పూలు, మేలి ముత్యాలూ ఉంటాయంది హంస. మరి నత్తలో అనడిగాయి కొంగలు. హంసకు నత్త అంటే తెలియదని తెలుసుకున్న కొంగలు అహహా యని నవ్వి ఎగతాళి చేశాయిట. ఒకవేళ ఓ కొంగ కనుక అనుకోకుండా హంసల గుంపులోకి వెడితే, బంగారు పూల గురించి తెలియనందుకు అదీ నవ్వుల పాలయ్యేది. ఇక్కడ కొంగలు గొప్పవా, హంసలు గొప్పవా అని కాక, ప్రతి సమాజంలోనూ గొప్పతనానికి ఓ నిర్వచనం ఉంటుందని ముఖ్యంగా ప్రవాసంలో ఉన్నవారు గ్రహించాలి. అప్పుడు ఎవరికీ మిడిసిపాటుండదు. ఇది ప్రవాసాంధ్రులుగా, ప్రవాస భారతీయులుగా, అనుభవాలనుంచి మేమందుకున్న సందేశం. అది ఈ నవల్లో అంతర్లీనం.

మూడవది-

కమలములు నీటబాసిన

కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్

తమతమ నెలవులు దప్పిన

తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ

మనకి మన అలవాట్లే మంచిమిత్రులు. స్థలం మారితే అలవాట్లే శత్రువులు కావచ్చు. అప్పుడా అలవాట్లు మార్చుకోవాలా, శత్రువుల్ని మార్చుకోవాలా అన్నది అవగాహనతో తీసుకోవాల్సిన వ్యక్తిగత నిర్ణయం. ఈ విషయంలో మా అనుభవాలు నేర్పిన పాఠాలే ఈ నవల కథాంశం.

కథలకు పేర్లు పెట్టడంలో సిద్ధహస్తులైన మాన్యులు రాచకొండ విశ్వనాథశాస్త్రి రచన 'సొమ్ములు పోనాయండి' ప్రభావంతో ఈ నవలకు ఫారిన్ వెళ్లాలండి, ఫారిన్ వెళ్లానండి పేర్లు మాకు స్ఫురించడం జరిగింది. ఈ నవల ప్రచురణ సందర్భంగా వారిని సంస్మరించడం మా బాధ్యత.

రెండు భాగాల ఈ నవలకు - సాహితీలోకంలో విశిష్టమైన కౌముది గ్రంథాలయయోగం పడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. సంపాదకులు శ్రీ కిరణ్‌ప్రభకు ధన్యవాదాలు.

ఉపోద్ఘాతం

ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. దొడ్లో పడక కుర్చీలో కూర్చుని పైకి చూస్తున్న నాలో ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.

ఆకాశంలో మెరిసే తారల్ని చూసినపుడల్లా నా మనసు వశం తప్పుతుంది. అందుకు అనేక కారణాలు...

*మనం ఎంత ఆధునికమైనా చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. - సం.*

కనిపించే చుక్కల్లో కొన్ని గ్రహాలు, కొన్ని నక్షత్రాలు. మతం వాటిగురించి కథలు చెబుతుంది. సైన్సు వాటి గురించిన నిజాలు చెబుతుంది. నేను కావడానికి సైంటిస్టునే అయినా సైన్సు చెప్పే నిజాలకంటే మతాలు చెప్పే కథలే నాకు బాగుంటాయి. ఆ కల్పితగాథల చుట్టూ జీవితాలనల్లుకుని కోట్లాది ప్రజలు జీవిస్తున్నారు. ఆ కల్పితగాథల పేరుతో యుద్ధాలు జరిగాయి. ఆలయాలు వెలిశాయి. సంస్కృతులేర్పడ్డాయి. ప్రపంచంలో ఈనాడున్న కులం, మతం, జాతి వగైరాలన్నీ కల్పితగాథల్లోంచి పుట్టినవే! ఈ కల్పితగాథల్లో చాలావరకూ ఆకాశం నుంచి పుట్టినవే.

మతం గురించిన నా అభిప్రాయాల సంగతెలాగున్నా - మతంలో చెప్పబడ్డ స్వర్గమంటే చిన్నప్పటినుంచీ నాలో గొప్ప ఆకర్షణ ఏర్పడింది. నా ఆలోచనల ప్రకారం స్వర్గం ఆకాశంలో ఉంటుంది. విమానంలో వెడితే స్వర్గం కనబడుతుందేమో అనుకునేవాడిని మొదట్లో.. కానీ ఎన్నో సంవత్సరాలుగా ఎందరో విమానాలలో ప్రయాణిస్తున్నా ఎప్పుడూ స్వర్గం ప్రసక్తి రాలేదు. ఇటీవల విమాన ప్రమాదాలు ఎక్కువై - విమానప్రయాణం చాలామందిని త్వరగా స్వర్గానికి చేర్చుతున్నదంటే అది వేరేసంగతి.

విమానాలుపోయి రాకెట్ యుగం వచ్చాక స్వర్గం గురించి తెలుస్తుందనుకున్నాను. కానీ రాకెట్లు శాస్త్రజ్ఞులాశించిన ప్రయోజనాలకే ఉపయోగపడ్డాయి తప్ప స్వర్గం గురించి తెలుసుకోలేదు.

ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెట్టేనాటికి నా బుద్ధి కాస్త వికసించింది. అయినా అక్కడ చంద్రుడు మానవరూపంలో అతడికి ప్రత్యక్షమైతే నేనింకా ఎంతో సంతోషించేవాణ్ణి.

కాలక్రమేణా నా బుద్ధి మతాన్ని వదిలిపెట్టి సైన్సుకు అనుగుణంగా ఆలోచించడం నేర్చుకుంది. స్వర్గం గురించి నా భార్యతోటీ విజ్ఞులైన మిత్రులతోటీ చర్చలు జరిపాక కొన్ని వింత నిజాలు గుర్తించాను. ఆ ప్రకారం స్వర్గం భూమ్మీదనే ఉండొచ్చు.

పుణ్యం చేసిన మనుషులు చచ్చి దేవతలై స్వర్గం చేసుకుంటారంటారు. దేవతలైనంత మాత్రాన వారికే భయమూ లేదని కాదు. దేవతలకు దొంగల భయముంది. మృత్యుభయముంది తప్పుచేస్తే రాజు - అనగా దేవేంద్రుడు శిక్షిస్తాడన్న భయమూ ఉంది. తప్పులు చేసే అవకాశమూ ఉంది.

దేవతల వస్తువులు ఎన్నోసార్లు దొంగలెత్తుకు పోయారు. దేవతలెన్నోసార్లు రాక్షసులతో యుద్ధం చేసి ఓడిపోయారు. ఆ యుద్ధాల్లో చచ్చిన వారిని బ్రతికించడానికి కచుడనేవాణ్ణి కూడా నియోగించారు, శుక్రాచార్యుడి వద్దకు వెళ్ళి మృతసంజీవినీ విద్యనేర్చుకుని రమ్మని. ఆ తర్వాత అమృతం తాగి చావులేనివారయ్యారు. దీన్ని బట్టి దేవతలకు మృత్యుభయమున్నదని తెలుస్తుంది. దేవతలకు వైద్యం చేయడానికి అశ్వనీ దేవతలున్నారు. కాబట్టి వారికి వ్యాధి భయంకూడా ఉండదన్నమాట. కోరికలు తీర్చే కామధేనువు, కల్పవృక్షాలు ఉన్నాయి కాబట్టి వారు కోర్కెలను జయించలేదు. అప్సరసలున్నారు కాబట్టి వారిలో స్త్రీ పురుష భేదాలూ ఉన్నాయి. వారు విషయలోలురనీ, సురాపానాభిలాషులనీ తెలుస్తూనే ఉంది. వారికి నాట్యము, సంగీతము ఇత్యాది కళాభిలాషకూడా ఉంది.

దేవతలలో లేనివల్లా కులమత భేదాలు, ఆకలిదప్పులబాధ. పేదరికం గురించి వారికి తెలియదు.

ఈరీత్యా చూస్తే - తగిన వైద్యుసదుపాయాలుండి, అందరికీ ఆహారం లభించి, మనుషులందరూ మనుషుల్లా బ్రతికే దేశముంటే - అదే స్వర్గం.

భూలోకంలో అలాంటి స్వర్గముందా? నేను చదివిన, విన్న విశేషాలను బట్టి - అమెరికా, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లండు వగైరా పాశ్చాత్యదేశాలు స్వర్గలక్షణాలు కలిగివున్నాయి. ఆ దేశాలు నిజంగా స్వర్గతుల్యమే అయితే - భూమ్మీద కొన్ని దేశాలు మాత్రమే స్వర్గతుల్యమెందుక్కావాలన్న ఆలోచన నన్ను వేధించేది?

స్వర్గప్రాప్తికి తపస్సు చేయాలి. ఆయా దేశప్రజలు తమదేశాలను స్వర్గం చేసుకునేందుకెలాంటి తపస్సుచేశారు? బొందితో స్వర్గాన్ని చూడటానికి నేనిప్పుడెటువంటి తపస్సు చేయాల్సివుంది?

"ఏమండీ - అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు?" అంది నా భార్య వసుంధర.

నే ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చి - "స్వర్గం గురించి వసూ!" అన్నాను.

"అంటే?" అందామె.

"స్వర్గమెక్కడుంటుందా అని!" ఆలోచిస్తూనే అన్నాను.

శ్రీమతి అదోలా నవ్వి - "దానికింత ఆలోచనెందుకు? నా సమక్షంలో స్వర్గముంటుందని చాలాసార్లన్నారు. అది నిజంకాదని మీ అనుమానమా?" అంది.

ఈ ప్రశ్నకు వెంటనే ఏం సమాధానమివ్వాలో తెలియలేదు. భార్య తెలివైనదైతే ఇలాంటి ఇబ్బందులు తప్పవు. ఓక్షణం ఆగి - "అది ఊహాస్వర్గం -" అన్నాను.

కానీ శ్రీమతి నన్ను వదలలేదు - "అయితే నేను అందంగా ఉంటానని కూడా చాలాసార్లన్నారు. అదీ ఊహల్లోని మాట కాదుగదా!" అంది.

శ్రీమతి వంక చూశాను. ఆమె కళ్ళలో ఆత్రుత స్పష్టంగా కనబడుతోంది. నేనామెను ప్రేమిస్తున్నాను. ఒక చూపులో పుట్టిన ప్రేమకాదది. ఆరుసంవత్సరాలకు పైగా కలిసిమెలిసి గడిపిన జీవితంలోంచి పుట్టిన ప్రేమ అది. నా భార్య నాకళ్ళకు అందంగా కనబడడమేకాదు. నానాటికీ ఆమె అందం పెరుగుతోంది. ఆ విషయాన్ని నానోట వినడం ఆమెకు ఇష్టం. తను అందంగా ఉందా లేదా అన్న బాధ ఆమెకులేదు. తన అందం నానోట పొగడబడితే ఆమెకు తృప్తి. ఆ తృప్తితో వెలిగే ఆమె కనులు చూడడం నాకిచ్చే సంతృప్తి ఇంతా అంతా కాదు.

ఎదుటివారికి సంతోషం కలిగించడంలోనే స్వర్గమున్నదేమో?

"ఊహలోని మాటే అనుకో. ఎటొచ్చీ నువ్వెదురుగా ఉంటే నేనెప్పుడు ఊహల్లోనే ఉంటాను. అందువల్ల నువ్వు మామూలుగా ఎలావుంటావో నాకు తెలియదు -" అన్నాను.

సంతృప్తి, కృతజ్ఞతలతో నా భార్య కళ్ళు మెరిశాయి.

ఒక మంచిమాటతో తృప్తిపడి భర్తనారాధించి అతడికి స్వర్గం చూపించే అల్పసంతోషి ఆడది. అయినా ఎన్నో సంసారాల్లో కలతలు పుట్టి నరకంగా ఎందుకు తయారౌతాయో నాకర్థంకాదు.

"నన్నుచూస్తే ఎప్పుడూ ఊహల్లోకి వెళ్ళిపోయే మీతో కలిసి మీ ఊహల్లోని స్వర్గంలో గడపాలని ఉంది నాకు" అంది శ్రీమతి.

"నాకూ ఉంది -" అన్నాను.

"సాధ్యపడుతుందంటారా?" అంది శ్రీమతి ఆశగా.

"ఓ పని చేస్తే సాధ్యపడుతుందండి -" అన్నాను.

"ఏమిటండీ?" అంది శ్రీమతి కుతూహలంగా.

'ఫారిన్ వెళ్ళాలండి!' వేళాకోళంగా అన్నాను.

***కథాప్రారంభం:***

స్వర్గం గురించి వినగానే ఎవరికైనా వెంటనే అక్కడికిపోయి జీవించాలని ఉంటుంది. కానీ అదేం ఖర్మోగానీ - జీవించి ఉండగా అది సాధ్యపడుతుందంటారా. అంటే చచ్చినవాళ్లకే గానీ బ్రతికున్నవాళ్లకు స్వర్గముండదా?

"ఏమైనా సరే - నేను తొందరగా స్వర్గానికి వెళ్ళాలి -" అన్నానొకరోజున ఏదో ఆలోచిస్తూ చటుక్కున.

అక్కడే ఉన్న అమ్మ ఆ మాటలు విన్నట్లుంది - "అవేం మాటల్రా వెధవా -" అని ఓసారి చుట్టూ చూసింది. అలా చూడడమెందుకంటే...

చెట్టంత కొడుకుని వెధవా అని పిలిచి అమ్మ తన మాతృత్వపు హక్కులను తరచుగా నిలబెట్టుకుంటూ ఉంటుంది. అమ్మ నన్ను వెధవా అంటే నాభార్య నన్ను - ఏమండీ అని పిలిచినంత మామూలుగాను ఉంటుంది నాకు. కానీ అలా అంటే - తన ఏమండీని మా అమ్మ వెధవతో పోల్చినందుకు శ్రీమతి కోప్పడుతుంది. ఆమె ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నాకా రెండు పిలుపులూ ఒకలాగే వినిపిస్తాయి.

నా పేరు రాజారావ్ అయినా నేను శివుడిలా నా భార్యకు  అర్ధశరీరం ఇచ్చేశాను. నా భార్య వసుంధరే అయినా పార్వతిలా తనూ నా అర్ధశరీరాన్నాక్రమించుకుంది. నేను ఇచ్చానా, ఆమె ఆక్రమించుకున్నదా అన్నది నా వ్యక్తిగత రహస్యం - కానీ నేను అర్ధశరీరుడినన్నది అందరికీ తెలిసిన నిజం. పెళ్ళాం కొంగు పట్టుకుని తిరుగుతున్నానని కొందరు వేళాకోళం చేస్తారు. చిలకాగోరికల్లా ఉన్నామని కొందరు ముచ్చటపడతారు. అమ్మ ఈరెండూ చేస్తుంది. అయితే అమ్మ మనసులో అసూయతో కూడిన చిన్న అనుమానముంది - నా భార్య నామీద తనకంటే ఎక్కువ అధికారం కలిగి ఉన్నాననుకుంటోందేమోనని. అందుకే శ్రీమతి ఎదుట నన్ను వెధవా అని పిలిచి తన ఆధిక్యతను చూపిస్తుంది. అమ్మకులా పదిమంది ఎదుటా నన్ను వెధవా అనలేదు శ్రీమతి. అయినప్పటికీ అమ్మ వెధవా అన్న ధ్వనితో సరిపోయేలా ఏమండీ అని బదులు తీర్చుకుంటుంది శ్రీమతి. అమ్మకది అర్థంకాదు.

నేనన్నమాటల్లోని తప్పును చెప్పాలనికాక తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని అమ్మ నన్ను వెధవా అని తిట్టింది కాబట్టి - ఆమె చుట్టూచూసింది తప్పితే నన్నాట్టే కోప్పడలేదు. అది తెలిసిన వాడనై - "నేను తప్పేమన్నాను? స్వర్గానికి వెడతానన్నాను -" అన్నాను మళ్ళీ.

ఈసారి నామాటలు అమ్మ బుర్రలోకి వెళ్ళాయి. ఓసారి కళ్ళొత్తుకుని - "కన్నతల్లి ఇలాంటి మాటలు విని ఎలా సహించగలదురా?" అని మళ్ళీ చుట్టూచూసి మరోసారి కళ్ళొత్తుకుంది - తన మాతృప్రేమను చుట్టూవున్నవారు గుర్తించాలన్న తాపత్రయం తప్పితే - నేనేదో అఘాయిత్యం చేయబోతున్నానని అమ్మ అనుకోవడంలేదు. మాములు సందర్భాల్లో కూడా పెద్ద పెద్ద డైలాగులు చెప్పి గంభీరంగా ఉండడం అమ్మకి అలవాటు.

"సహించడానికిందులో ఏముందమ్మా? స్వర్గంలో బాగుంటుంది -" అన్నాను నేను.

"మీరు మళ్ళీ ఇలాంటిమాటలంటే నామీద ఒట్టే!" అంది శ్రీమతి. తనమీద ఒట్టేసుకుని ఎలాంటి అసాధ్యాలనైనా నా చేత సాధ్యాలుగా మారిపించగలనని ఆమె నమ్మకం. నాకు ఒట్లమీద నమ్మకంలేదు. అయినప్పటికీ ఆంజనేయుడు బ్రహ్మాస్త్రానికి కట్టుబడినట్లు నేనూ శ్రీమతి ఒట్లకు కట్టుబడక తప్పదు.

"నేను తప్పేమన్నాను?" అన్నాను ఆశ్చర్యాన్ని నటిస్తూ.

"తప్పుకాక మరేమిటి? ఏ ఆడదైనా తనే ముందు పసుపూకుంకమలతో వెళ్ళిపోవాలనుకుంటుంది -" అంటూ శ్రీమతి ఈ దేశంలో ఆడదానికుండే ఏకైక కోరిక ఏమిటో చెప్పింది. అది చెప్పేటప్పుడు తన గొంతులోని తడిని దాచి పెట్టడానికి ప్రయత్నిస్తోందామె. నా మాటలు నిజంగా ఆమెకు బాధను కలిగించినట్టున్నాయి.

"ఇంతేనా నీ బాధ. నేను స్వర్గానికి వెళ్ళేముందు నీక్కావలసినంత పసుపూ, కుంకుమా కొని మరీ వెడతాను, సరేనా?" అన్నాను.

ఈసారి అమ్మ వెధవా అనకుండా, అందరికేసీ కాక నా వైపు మాత్రమే చూసి తిట్టింది. ఇప్పుడామె నలుగురికోసం కాక నాకోసం మాత్రమే అమ్మగా మారిపోయిదని గ్రహించాను.

"స్వర్గమంటే అక్కడికే వెళ్ళి ఉండిపోను. ఏదో కొన్నాళ్ళుండి మళ్ళీ వెనక్కి వచ్చేస్తాను -" అన్నాను విషయానికి వస్తూ.

అప్పుడక్కడ అమ్మ, శ్రీమతి కాక అన్నయ్య, వదిన, ఇద్దరు తమ్ముళ్ళు, అయిదుగురు చెల్లెళ్ళు, అన్నయ్య కూతురు, నా పిల్లలిద్దరు ఉన్నారు. చివరి ముగ్గురూ కాక మిగతా అందరూ నామాట విని నోళ్ళు తెరిచారు.

"ఎలా సాధ్యం?" అంది వదిన - అందరికంటే ముందుగా నోటిని తన స్వాధీనంలోకి తెచ్చుకుని.

"స్వర్గమంటే ఏమిటి?" అనడిగాను నేను.

అందరూ తలోరకంగా చెప్పారు.

అన్నింటికీ తల అడ్డంగా ఊపాను - "స్వర్గంలో దేవతలుంటారు. వాళ్ళు రాక్షసులతో యుద్ధాలు చేస్తారు. ఆ యుద్ధంలో దేవతలు చనిపోయేవారు మొదట్లో. రాక్షసుల గురువు శుక్రాచారుడి వద్ద మృతసంజీవనీ విద్య నేర్చుకుని రమ్మని దేవతలు కచుణ్ణి నియోగించారు. ఆ విద్య అతడికి ఫలించలేదు. తర్వాత సాగరమధనంతో అమృతం సాధించారు. అప్పట్నించీ వాళ్ళకు చావులేకుండా పోయింది. అంటే దేవతలకు మృత్యుభయముండేది. వైజ్ఞానికంగా అభివృద్ధి చెంది వైద్యసదుపాయాలు పెరిగి వారు మృత్యువును జయించే స్థితికి చేరుకున్నారు -"

"దేవతలకు వైద్యసదుపాయాలేమిట్రా వెధవా?" అని అమ్మ ఓసారి చుట్టూ చూసింది.

"దేవతలకూ రోగాలుంటాయమ్మా - అందుకే కదా స్వర్గంలో అశ్వనీ దేవతలుంటారు...." అన్నాను.

"అంతా వితండవాదం -" విసుక్కుంది అమ్మ.

"వితండవాదం కాదు - నిజమే! చచ్చిన మనిషి ఆత్మకు మళ్ళీ చావుండదంటారుకదా - అంటే దేవతలనబడేవారు మనుషుల్లో ఒక తెగ తప్పితే చచ్చినవాళ్ళ ఆత్మలు కాదన్నమాట. ఈ దేవతలు తెల్లగా బలంగా ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి జబ్బునైనా తగ్గించే అమృతంలాంటి మందులూ, అశ్వనీ దేవతల్లాంటి వైద్యులూ వారి సేవ చేయడానికి సిద్ధం. కోరినవేమైనా క్షణాలమీద తయారుచేసివ్వగల కల్పవృక్షం, కామధేనువులాంటి యంత్రాలు వారికుంటాయి. శత్రువుని తిప్పికొట్టడానికి వజ్రాయుధంలాంటి తిరుగులేని అస్త్రాలుంటాయి. దూరదర్శని, శబ్దగ్రహిణి వంటి విద్యలు వారికి కరతలామలకం. అక్కడ పేదరికం, ఆకలిచావులుండవు. అందరూ సంతోషంగా విలాసజీవితం గడుపుతూంటారు.."

నేనింకా ఏదో అనబోతూండగా - "ఏదైనా ఫారిన్ ఛాన్స్ చూస్తున్నావా ఏమిటి?" అన్నాడు అన్నయ్య.

"ఫారిన్ అంటే?" అంది ఆఖరు చెల్లాయి.

"ఫారిన్ అంటే చాలా దూరముంటుంది. విమానంలో వెళ్ళాలి -" అన్నాడాఖరి తమ్ముడు. తనకు తెలిసిన విషయాన్ని తనకంటే ముందుగా ఇంకెవరైనా చెప్పేస్తారేమోనని కంగారుగా, హడావిడిగా వాడామాటనేశాడు.

"అయితే ఫారిన్ అంటే స్వర్గమే! విమానంలో వెడితే స్వర్గానికి పోవచ్చునని మా మేష్టారు చెప్పారు-" అంది ఆఖరు చెల్లాయి. అది సెవెన్తుక్లాసు చదువుతోంది. క్లాసులో దాని మేష్టారు జోక్ చేసుంటాడు. అది నిజమేననుకుంది.

మేమంతా ఓసారి ఘొల్లుమంటే ఎందుకో తెలియక అది మా అందరివంకా కంగారుగా చూసింది.

"మీ మేష్టారి జోకుకి మేమంతా పగలబడి నవ్వేమని చెప్పు. ఆయన చాలా సంతోషిస్తారు -" అన్నాను నేను దాంతో.

ఇంతమంచి జోకులు వేయగల బుద్ధిశాలి సెవెన్తుక్లాసు టీచరైనందుకు అన్నయ్య కాస్తబాధపడ్డాడు.

"మీ మేస్టారింకేమైనా జోకులేస్తే చెప్పు" అంది వదిన.

"భారతదేశంలో ఉన్నది ప్రజారాజ్యంట -" అంది ఆఖరి చెల్లెలు.

అమ్మ తప్ప తక్కినవారందరు నవ్వాం. మేమంతా నవ్వేక అమ్మకూడా నవ్వింది. తమాయించుకున్నాక - "ఇంతకీ ఇది జోకని నీకెలా తెలిసిందే?" అన్నాను. చెల్లాయి తెలివిమీద నాకు మరీ అంత నమ్మకంలేదు.

"ఏమో - ఇందాకటిదీ జోకని నాకు తెలియలేదు. మీరు నవ్వుతున్నారు కదా అని ఆయన మాకు చెప్పిన పాఠం చెప్పేశాను -" అంది ఆఖరి చెల్లెలు.

"ఈరోజుల్లో చదువే పెద్దజోకు -" అన్నాడు అన్నయ్య.

"ఈరోజుల్లో అవడానికి మీరోజుల్లో చదువెలాగుండేమిటి?" అంది వదిన చిరుకోపంతో.

అప్పటికి అన్నయ్యకింకా ముప్పైఒకటి నడుస్తోంది. కానీ వాడు మాటిమాటికీ మారోజులు మారోజులు అంటూ పాతతరానికి ప్రతినిధిలా మాట్లాడటం వదినకిష్టముండదు.

"మీరోజుల్లో సంగతి తెలియదుకానీ - మా రోజుల్లో ఎలా ఉండేదంటే..." అన్న కొత్త స్వరం ఆ వాతావరణంలో ప్రవేశించింది.

ఆ గొంతు నాన్నగారిది. అప్పుడే ఆయన వీధిలోంచి దొడ్లోకి వచ్చినట్లున్నారు.

తన రోజుల్లో చదువు గురించి ఆయన చాలాసార్లు చెప్పి ఉన్నారు కాబట్టి మాలో ఎవ్వరికీ వినే ఆసక్తిలేదు. ఆయన్నాపే శక్తి అక్కడున్నవారిలో ఎవరికీ ఉందనుకోను. నేను అసహాయంగా తమ్ముడి వంక చూశాను. వాడికాయనదగ్గర కాస్త చనువెక్కువ. వాడు నా చూపులనర్థం చేసుకుని - "అదికాదు నాన్నగారూ - చిన్నన్నయ్య ఫారిన్ వెడతాననడానికి బదులు - తమాషాకి స్వర్గం వెడతానన్నాడు. దానిమీదే మాటలు నడుస్తున్నాయి -" అన్నాడాయనతో.

హఠాత్తుగా అమ్మకేదో స్ఫురించినట్లుంది - "స్వర్గం వేరే ఎక్కడోలేదురా - ఇక్కడే ఉంది. మీరంతా ఇక్కడిలా కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుతూంటే వేరే స్వర్గం ఎందుకురా?" అంది.

ఈ మాటలకు నాన్నగారు వెంటనే రియాక్టయ్యారు - "నేను బ్రతికుండీ చచ్చినవాణ్ణయ్యాను - నీతో పెళ్ళయ్యాక. అందువల్ల నీతో జీవితం స్వర్గంలాంటిదే మరి నాకు -"

శ్రీమతి, వదిన కూడా ఈ మాటలకు గతుక్కుమన్నట్లు కనబడ్డారు. శ్రీమతి గతుక్కుమనడానికి కారణం నాకర్థమయింది. తనతోటి జీవితం స్వర్గమని ఆమెతో పలుమార్లు చెప్పి సంతోష పెట్టాను. ఆ వాక్యానికిటువంటి విపరీతార్థం తీసిన వ్యక్తికి నేను స్వయానా పుత్రుణ్ణి కావడమూ, ఆమె గతుక్కుమనడానికి కారణమూ ఒక్కటే అయుండాలి. శ్రీమతితోపాటు వదిన కూడా గతుక్కుమందంటే - అన్నయ్యకూడా ఆమెతో నాకులాగే అని ఉంటాడు.

"త్వరలోనే నాకు స్వర్గప్రాప్తి కలగాలని ఆశీర్వదించమ్మా!" అన్నాను అమ్మవైపు తిరిగి. స్వర్గమంటే వేరే ఎక్కడో ఉందని నేననుకుంటున్నట్లు శ్రీమతికి తెలియాలని నా ఆశ.

అన్నయ్య కంగారుపడి - "మళ్ళీ నువ్వు వాణ్ణి వెధవా అని తిట్టేవు గనుక - కథ మొదటికి వస్తుంది. వాడికి ఫారిన్ ఛాన్సు తగలాలని ఆశీర్వదించమ్మా" - అంటూ అమ్మకేం చేయాలో సూచించాడు.

"ఆ మాత్రం నాకు తెలియదుట్రా - నా కడుపున పుట్టినందుకు మీరంతా ఒకరితర్వాత ఒకరు దేశాదేశాలు తిరిగి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటారు. ఇవి తథ్యం" - అంది అమ్మ - మాకేపేరు వచ్చినప్పటికీ అది తన కడుపున పుట్టిన ఘనతేనని స్పష్టం చేస్తూ.

ఆ సంభాషణ అలా చాలాదూరం వెళ్ళినా దానిగురించి నేనెప్పుడంత సీరియస్‌గా ఆలోచించలేదు. అయితే రాత్రి శ్రీమతి నాతో - "మీరు వెడితే స్వర్గానికి నేనూ మీతోపాటు వస్తానండీ" అన్నప్పుడు నా ఆలోచనలు పరిపరి విధాలపోయాయి.

నాకు నిజంగా ఫారిన్ ఛాన్స్ వస్తుందా? వస్తే శ్రీమతిని కూడా తీసుకుని వెళ్ళగల్గుతానా?

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments